హిందీ అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ చంద్రముఖర్జీ


చంద్రముఖర్జీకి బొకేను అందజేస్తున్న హర్బన్స్ కౌర్, భాగ్యవతి, మంజుల

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర హిందీ అకాడమీ డైరెక్టర్‌గా ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ నియమితులయ్యారు. ఆమెకు హిందీ అకాడమీ డైరెక్టర్‌గా ప్రభుత్వం అడిషనల్ ఛార్జ్ అప్పగించింది. ఈ సందర్భంగా డాక్టర్ హర్బన్స్ కౌర్, డాక్టర్ భాగ్యవతి, డాక్టర్ మంజుల ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం ప్రొఫెసర్ చంద్రముఖర్జీ మాట్లాడుతూ.. హిందీ భాష అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్‌గా శ్రీను



గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సి. శ్రీను పూర్తి స్థాయి బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.నాగదుర్గాప్రసాద్ బదిలీపై వెళ్లాడు. ఆయన స్థానంలో శ్రీనును పదోన్నతి కల్పిస్తూ మొఘల్‌పురా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగుతున్న శ్రీనును పూర్తిస్థాయి ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జియాగూడ: యువతకు వివిధ రకాల శిక్షణలు ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షణీయమని ఇమాంపురా నవ భారత సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం జియాగూడ ఇమాంపురా ఎంసీహెచ్ కమ్యూనిటీ హాల్ వద్ద మ్యాజిక్ బస్ లైవ్లీహుడ్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటైన జాబ్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో యువకులు పది, ఇంటర్మీడియేట్, డిగ్రీలు చదివిన వారికి ఐటీఎస్, బీపీఓ, వాయిస్, డేటా ఎంట్రీ, సేల్స్ మార్కెటింగ్‌లలో శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వినయ్ కుమార్, జి.మహేందర్, ఎం.మహేష్‌బాబు, జాద్వంత్‌కుమార్, శ్రవణ్, గౌతమ్, త్రినాథ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రకాంత్, ఇంతియాజ్, సంజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే విద్యారంగం కొనసాగాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్‌దాస్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో విద్యా వ్యవస్థ ప్రైవేటు యాజమాన్యాల చేతుల్లో బందీ అయ్యిందని ఓయూ ప్రొఫెసర్ వెంకటదాస్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యా రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ ప్రభుత్వ రంగంలోనే విద్యను కొనసాగించాలని కోరారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన, నైపుణ్యతను ఉన్న విద్యను అందించే లక్ష్యంగా అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పెరియార్, ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు మల్లేష్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు గణేష్, డాక్టర్ సీతారాం, ఉపేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ హెచ్‌సీయూ అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కన్వీనర్‌గా గుంటి రోహిత్, అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల, ఉపాధ్యక్షులుగా రచన, దివాకర్, ఆశ్చర్యను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సంధ్య పోగు ప్రసన్న, ముద్దమ్ నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు అంజి ఎర్రోళ్ల మాట్లా డుతూ బహుజన మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా బీఎస్‌ఎఫ్ పనిచేస్తుందన్నారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరామ్‌ల ఆలోచనలు, పోరాటాలు, త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ బహుజన విద్యార్థులను సంఘటితం చేయడంతో బీఎస్‌ఎఫ్ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.

బస్టాండ్ ఊసేదీ..?

చార్మినార్‌లో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు

- ఆర్టీసీ బస్సులకు సరైన ఏర్పాట్లు లేక రోడ్డుపైనే మలుపులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ఆర్టీసీ డ్రైవర్లు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు చార్మినార్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తామంటూ ఇక్కడి పాత భవన సముదాయాన్ని 2018 జనవరి 24న కూల్చివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం పనులు జరుగకపోవడంతో ఇక్కడ ఖాళీ స్థలమే ఉంది. అటు పార్కింగ్ నిర్మాణం జరుగక.. ఇటు బస్టాండ్ లేకపోవడంతో పాతబస్తీ ప్రయాణికులు, పర్యాటకులు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.


నడిరోడ్డుపైనే మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు

36 ఏళ్ల క్రితం..

36 ఏళ్ల క్రితం చార్మినార్ బస్‌స్టేషన్ చార్మినార్ కట్టడం వద్ద కొనసాగింది. 1989లో సీపీపీ (చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు) పనుల కోసం చార్మినార్ కట్టడం వద్ద నుంచి ఆర్టీసీ బస్సులను పంచ్ మోహల్లాలోని చార్మినార్ బస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సుల తరలింపునకు ముందు పంచ్ మోహల్లా డిపో కొనసాగేది. ఆర్టీసీ బస్సులను చార్మినార్ కట్టడం నుంచి పంచ్ మోహల్లాకు తరలించిన అధికారులు 2005లో ఇక్కడి నుంచి తరలించడానికి ప్రణాళికలు రూపొందించారు. 2006లో స్థానిక వ్యాపారులు, ప్రయాణికులు తమకు ఇక్కడే బస్టాండ్ ఉండాలంటూ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మానవ హక్కుల కమిషన్ 2007లో పంచ్ మోహల్లాలోనే చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ కొనసాగాలంటూ ఆదేశాలు జారీ చేశారు. 2008లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను తరలించొద్దంటూ సంబంధిత ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రయాణికుల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు అప్పట్లో చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ తరలింపును విరమించుకున్నారు. కాగా 2018 జనవరి 24న నుంచి పూర్తి స్థాయిలో భవనాన్ని తొలగించడంతో చార్మినార్‌లో ఆర్టీసీ బస్సులను నిలపడానికి ఎలాంటి బస్టాండ్ లేకుండా పోయింది.

రోడ్డుపైనే టర్న్ చేస్తున్న డ్రైవర్లు..

ఆర్టీసీ బస్సులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మధ్యలోనే బస్సులను తిప్పుతున్నారు డ్రైవర్లు. దీంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా అప్పుడప్పుడు చిన్న చిన్న ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలి

అఫ్జల్‌గంజ్: మేరు కులస్తులకు ప్రభుత్వం అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..40 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడిగా కొనసాగుతున్న తనకు మేరు కులస్తుల చైర్మన్ పదవి అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కష్టపడి పనిచేస్తున్న తనలాంటి నాయకుడికి చైర్మన్ పదవి అప్పగించి న్యాయం చేయాలని భట్టి విక్రమార్కను కోరారు.


ఉప ముఖ్యమంత్రిని కలిసిన పోల్కం శ్రీనివాస్

గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో మేరు కులస్తులు కీలక పాత్ర పోషించారని పోల్కం శ్రీనివాస్ అన్నారు. భట్టి విక్రమార్కకు తన బయోడేటాను అందజేసి మేరు కులస్తులను న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రింగ్‌ఫైట్ విజేతలకు అవార్డుల ప్రదానం


మెమొంటోలు ప్రదానం చేస్తున్న రామిరెడ్డి

సుల్తాన్‌బజార్: రింగ్ ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, 8వ జాతీయ స్థాయి రింగ్ ఫైట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్లేయర్స్ అవార్డు సమావేశం ఆదివారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా సౌత్ ఏషియన్ స్కూల్ ఫోర్స్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ సెక్రెటరి డాక్టర్ రామిరెడ్డి హాజరై రింగ్ ఫైట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెమొంటోలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రింగ్ ఫైట్ గేమ్‌ను జాతీయ స్థాయిలో కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తీసుకుపోవడం దేశానికే గర్వకారణమన్నారు. రింగ్ ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు తాడెం రవికుమార్ మాట్లాడుతూ..మే 23 నుంచి 26వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా 1వ అంతర్జాతీయ రింగ్ ఫైట్ చాంపియన్‌షిప్ పోటీలను స్థానిక దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో జరుగబోతుందని తెలిపారు. ఈ పోటీలలో దాదాపు 8 దేశాల క్రీడాకారులు పాల్గొనబోతున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రింగ్ ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరి మచ్చ ప్రభాకర్, షేక్ అబ్దుల్లా, చంద్రశేఖర్, ఓంప్రకాష్, పూర్ణచందర్, ప్రేమ్‌కుమార్, బసవరాజు, జస్వీందర్ సింగ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

యాకుత్‌పురా: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో యాకుత్‌పురా ఎస్సార్టీ కాలనీలోని సయ్యద్ విల్లా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు శిక్షణ కేంద్రాల్లో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన 334 మంది మహిళలకు ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలిసి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలకు చేయూత అందించేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్, డబీర్‌పురా, పత్తర్‌గట్టి, సంతోష్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీ, అలందర్ వాలాజాహి, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, ముజఫర్ హుస్సేన్, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

‘సైన్స్ ఎగ్జిబిషన్లు మేధాశక్తిని పెంచుతాయి’



జియాగూడ: సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతాయని కేటీఎస్ అధ్యక్షుడు పి.జైపాల్ రెడ్డి, అకాడమిక్ బి.బాలాజీ అన్నారు. ఆదివారం జియాగూడలోని కృష్ణవేణి టాలెంట్స్ స్కూల్స్ జియాగూడ, రహీంపురా బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, నాగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన డిస్కవర్, ఇన్స్పైర్, సక్సెస్ (ఇన్నోవేటివ్ షోకేస్) 2025 ప్రదర్శనలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో 770 మంది విద్యార్థులు 450 ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్థానిక బస్తీల వాసులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ జహంగీర్ పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవ ఆలయ బ్రహ్మోత్సవాలు

చాంద్రాయణగుట్ట: ఐదు రోజుల పాటు కనుల పండువగా కొనసాగిన చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం 7 గంటలకు అభిషేకం, ఆరాధన, 9 గంటలకు సుదర్శన హవనం, మహాపూర్ణాహుతి, ధ్వజ అవరోహనం పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మధ్యాహ్నం నిర్వహించిన చక్రతీర్థం పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్, శైలేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్‌తో పాటు కాంగ్రెస్ చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి బోయ నగేష్ పాల్గొన్నారు.


చక్రతీర్థం చేయిస్తున్న పురోహితులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీఏడీ ఓ ప్రకటనలో తెలిపారు. నవాబ్ సాబ్ కుంట విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. రషీద్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

26న మహా రుద్రాభిషేకం

చార్మినార్: మహాశివరాత్రి సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. 26న తెల్లవారుజామున 4 గంటల నుంచి గణపతి పూజ, పుణ్య వాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అభిషేకం, అమ్మవారికి, ఆలయ సకల దేవతాభిషేకం, రుద్ర హోమం, అలంకరణ, సహస్రనామ బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 9 గంటలకు 108 కళశాలతో అష్టోత్తర మహా రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, అన్న అభిషేకం, పంచ హారతి మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం మహా శివరాత్రి జాగరణ కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

బాపూజీ సార్వజనిక గ్రంథాలయాన్ని పరిరక్షించాలి

గన్‌ఫౌండ్రీ: నిజామాబాద్‌లోని బాపూజీ సార్వజనిక వచనాలయానికి సంబంధించిన రెండెకరాల భూమిని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తక్షణమే వారిని అడ్డుకోవాలని బాపూజీ వచనాల పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కోనేరు సాయికుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నిజామాబాద్‌లో 1923 నుంచి మూడు చారిత్రాత్మకమైన గ్రంథాలయాలు ఉన్నాయని, వాటిని 1951లో సార్వజనిక వచనాలయంగా పేరు మార్చారని గుర్తుచేశారు. వాటిని నేడు కొంత మంది డిజిటల్ లైబ్రరీగా పేరు మార్చి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి రూ.3 నగదు ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మెరుగు జంగయ్య గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ యువకుడుఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అల్మారా తెరిచిన శబ్దం విన్న పక్కింటి మహిళ అక్కడికి రాగా సదరు యువకుడు ఆమెను పక్కకు తోసి బయటికి పరిగెత్తాడు. ఈ దృశ్యాన్ని పక్కనే ఉన్న మేడపై ఉన్న మరో మహిళ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసింది. దీనిపై సమాచారం అందుకున్న జంగయ్య కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి పరిశీలించగా రూ. 3 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

అత్తాపూర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ అన్నారు. సులేమాన్‌నగర్ డివిజన్ చింతల్‌మెట్ పరిధిలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకొని వాటిని తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని తాను అధికారులను ఆదేశించానన్నారు. ఈ విషయంపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు జనరల్ మేనేజర్‌ను కలిశానన్నారు. నియోజకవర్గంలో నీటి కొరత, కోతలు లేకుండా చూస్తామని జలమండలి అధికారులు తనకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీముద్దీన్, హబీబ్ తదితరులున్నారు.


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెండింగ్ బకాయిలు సకాలంలో చెల్లించాలి


విద్యుత్ బకాయిలపై సమీక్షిస్తున్న డీఈ సుధీర్‌కుమార్

నాంపల్లి: పెండింగ్ బకాయిలను సకాలంలో చెల్లించాలని మెహిదీపట్నం డివిజన్ డీఈ టి.సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఏసీగార్డ్స్‌లోని సబ్ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యుత్ బకాయిల మానిటరింగ్ కార్యక్రమాన్ని సమీక్షించారు. విద్యుత్ బకాయిల వివరాలను కింది స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ గడువు లోపే బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఏడీఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ..అజామాబాద్, మెహిదీపట్నం, సైఫాబాద్ డివిజన్ల పరిధిలో రూ.21 కోట్లు బకాయిలు ఉన్నట్లు వివరించారు. ఏఈ చిలుక నారాయణ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ సర్వీస్ నంబరుకు మొబైల్ నంబరును లింకు చేసుకోవాలని కోరారు. విద్యుత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే 1912 ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి.సమ్మయ్య, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాక–మొరంబావి రూట్‌లో నూతన సీసీ రోడ్డు


గతంలో గుంతలమయంగా ఉన్న రహదారి


నూతనంగా వేసిన సీసీ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్‌లోని మొరంబావి నుంచి ఛత్రినాక చౌరస్తా వరకు నాలా విస్తరణ పనులు, శిథిలమైన రహదారితో వాహనదారులకు కలుగుతున్న విషయమై ‘సాక్షి’ దినపత్రికలో జనవరి నెల 6న ‘అటకెక్కిన నాలా విస్తరణ పనులు’అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నాలా విస్తరణకు సాంకేతిక సమస్యలు ఉండడంతో అప్పటి వరకు వాహనదారులకు ఇబ్బందులు కలగరాదన్న ఉద్దేశంతో మొరంబావి నుంచి ఛత్రినాక వరకు నూతన సీసీ రోడ్డు వేశారు. ఇటీవలే రోడ్డు అందుబాటులోకి రావడంతో వాహనదారులకు ఉపశమనంగా మారింది. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కార దిశగా ప్రయత్నించిన ‘సాక్షి’కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

శాస్త్రీయ సంగీత కళలపై అవగాహన కల్పించాలి


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళలపై అవగాహన కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా భం భం భోలే పేరిట సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ సంగీత కళలు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళలపై చిన్నారులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటి కవిత, ప్రొడ్యూసర్ కౌన్సిల్ కోశాధికారి టి.రామసత్యనారాయణ, సినీనటులు శ్రీవాణి, విక్రమ్, మేము సైతం యువసేనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వప్న శ్రీనివాస్, అకాడమీ వ్యవస్థాపకులు లలిత తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సుల్తాన్‌బజార్: దేశభాషలందు తెలుగు లెస్సా అని ఎందరో కవులు, రచయితలు, మహానుభావులు తెలుగు భాష ప్రాధాన్యతను ప్రపంచ పటంలో నిలిపారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆవుల మంజుల పేర్కొన్నారు. చాదర్‌ఘాట్‌లోని భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పద్మావతి, డాక్టర్ వెంకటరమణ, డి.మధు, భాగ్య మెమోరియల్ గరల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ శ్రీలత గౌతమ్, ప్రిన్సిపాల్ రత్న మేరీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..నేటితరం విద్యార్థులు ప్రాశ్చాత్య పోకడాలకు పోకుండా తెలుగు భాష ప్రాధాన్యతను గుర్తించి భాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా భ్యాగ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 2024 వరకు ఉన్న విద్యార్థులకు విద్యను అందించిన ఉపాధ్యాయులను, 4వ తరగతి సిబ్బందిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

నెల్లి లక్ష్మీనారాయణను పద్మశ్రీ అవార్డుకు నామినేట్ చేయాలి



మాట్లాడుతున్న నారాయణ ముదిరాజ్

గన్‌ఫౌండ్రీ: నగర మాజీ మేయర్ దివంగత నెల్లి లక్ష్మీనారాయణ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డుకు నామినేట్ చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ముదిరాజ్ సంక్షేమ సమితి కన్వీనర్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నెల్లి లక్ష్మీనారాయణను ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులాన్ని తరతరాలుగా ప్రభుత్వాలు విస్మరించాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంక్షేమ సమితి అధ్యక్షులు అల్లాదుర్గం సురేష్ ముదిరాజ్, నాయకులు నర్సిములు శ్రీహరి, కోట సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

అబిడ్స్: ఈ నెల 24, 25 తేదీల్లో ఆల్ ఇండియా స్థాయిలో పలు బ్యాంకుల ఉద్యోగులు నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐబీఈఏ కార్యదర్శి రాంబాబు, రవీంద్రనాథ్, సీబీఓఏ నాయకులు లింగారెడ్డి, కెనరాబ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ కార్యదర్శి బీఎస్.మదుసుధన్ పేర్కొన్నారు. అన్ని బ్యాంకులు వారానికి ఐదు రోజులు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించే బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు అందరూ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలు బ్యాంకుల ఉద్యోగులు ప్రదర్శనలు నిర్వహించారు.



ప్రదర్శన నిర్వహించిన పలు బ్యాంకుల ఉద్యోగులు